క్లుప్తంగా

జీతాలు చెల్లించాలని వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రసాదరావు, వర్కర్లు

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు బకాయిపడిన జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎంఈఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆరు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో వర్కర్ల కుటుంబాలు పస్తులు ఉంటున్నాయన్నారు. వర్కర్లకు బ్లౌజ్‌లు, చీపుర్లు, బకెట్లు, యూనిఫాంలు, ఫినాయిల్, డెటాల్ వంటివి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు లక్ష్మి, వెంకటమ్మ, శాంతి, పలువురు వర్కర్లు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు ఈశ్వరరావు

పాతపట్నం: ఫిజియోథెరపీతో అంగవైకల్యాన్ని దూరం చేయవచ్చని ఫిజియోథెరపిస్టు ఎస్.ఈశ్వరరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలోని భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు సోమవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఇంటి వద్ద క్రమం తప్పకుండా వ్యాయామం ఎలా నిర్వహించాలో తల్లిదండ్రులకు, ఐఈఆర్‌టీఏస్‌లకు అవగాహన కల్పించారు. ఐఈఆర్‌టీఏస్‌లు పి.సుధారాణి, ఎస్.ఇన్నా, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ పంటలను విక్రయిస్తున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పురుగు మందులు, రసాయన ఎరువుల్లేని ఆరోగ్యకరమైన పంట దిగుబడులను సాధిద్దామని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ దిగుబడులు విక్రయ కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేసి విక్రయించారు. ఇంటి పెరటిలో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలను పెంచుకోవచ్చన్నారు. ఎరువులు, పురుగు మందులు వినియోగం లేకుండా పండించే పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఐసీఆర్పీలు బి.సంతోషి, పి.పూజ, బి.పూర్ణారావు, ఐ.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

స్థలం మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న యోగా శిక్షకులు

పాతపట్నం: నియోజకవర్గ కేంద్రంలో యోగా శిక్షణ కేంద్రానికి స్థలం మంజూరు చేయాలని యోగా శిక్షకులు కె.రమేష్, ఎ.కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిసి వినతిపత్రం అందజేశారు. గతకొంత కాలంగా పాతపట్నంలో యోగా శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేకంగా స్థలం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సైలాడ సతీష్, అక్కందర సన్యాసిరావు ఉన్నారు.

17 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు: బెల్ట్ షాపుల నిర్మూలనలో భాగంగా స్థానిక ఎస్ఐ అమీర్ అలీ సోమవారం నివగాం గ్రామంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన నల్లాన హరిశ్చందరరావు షాపులో 17 మద్యం బాటిళ్లు లభించినట్లు ఎస్ఐ చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈయనపై గతంలో కూడా కేసు నమోదై ఉన్నట్లు ఎస్ఐ చెప్పారు.

రూ.25 వేల ఆర్థికసాయం

పొందూరు: మండలంలోని మలకాం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి అదపాక దేవీవరప్రసాద్‌కు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు రూ.25 వేలను సోమవారం అందజేశారు. దేవీవరప్రసాద్ గ్రామంలో సైకిల్ తొక్కుతూ కింద పడిపోవడంతో గాయపడ్డాడు. శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడటంతో విరాళాలు సేకరించి ఈ మొత్తాన్ని విద్యార్థి కుటుంబ సభ్యులకు అందించారు.

రికవరీ అయ్యేనా?



సారవకోటలో సోషల్ ఆడిట్ సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ బి.సుధాకరరావు (ఫైల్)

- సామాజిక తనిఖీల్లో బయటపడిన పలు అక్రమాలు
- 15 రౌండ్లు ముగిసినా నేటికీ పూర్తికాని రికవరీలు

సారవకోట: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతిఏటా చేపడుతున్న పనులకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత సామాజిక తనిఖీలు జరుగుతుంటాయి. ఈ తనిఖీల్లో సంబంధిత సిబ్బంది చేసిన అవకతవకలు, మస్తర్లు, వేతనాల్లో తేడాలను గుర్తిస్తారు. సంబంధిత సిబ్బందికి ప్రజా వేదిక రోజున రికవరీకి ఉన్నతాధికారులు నివేదిక తయారుచేస్తారు. ఉపాధి హామీ పథకం ద్వారా వేతనాల రూపం, మెటీరియల్ పనులకు కోట్లాది రూపాయలు కేటాయించి పనులు చేపడుతుంటారు.

నరసన్నపేట నియోజకవర్గంలో ఇలా..

జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు నరసన్నపేట నియోజకవర్గంలో 15 రౌండ్ల సామాజిక తనిఖీలు పూర్తయ్యాయి. ప్రతీ సామాజిక తనిఖీలో గుర్తించిన రికవరీలలో నేటికీ పూర్తిగా సంబంధిత సిబ్బంది నుంచి డబ్బులు వసూలు చేసే దాఖలాలు కన్పించడం లేదు. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు రాజకీయ కారణాల ఒత్తిడి వలన రాజీనామాలు చేయడం, కొందరు అనారోగ్య సమస్యలు వలన మృతి చెందడంతో మొదటి, రెండో విడతలలో ఉన్న రికవరీలు కూడా ఇప్పటికీ పూర్తికాలేదు. లక్షలాది రూపాయలు రికవరీ కాలేదు. నరసన్నపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.7 లక్షలు రికవరీ కాలేదు. నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లో 15 రౌండ్ల సామాజిక తనిఖీలు పూర్తికాగా.. సారవకోట మండలంలో 16 రౌండ్ల సామాజిక తనిఖీలు పూర్తయ్యాయి. 16వ రౌండ్ సామాజిక తనిఖీ ఈ ఏడాది నవంబర్‌లో జరగగా.. సామాజిక తనిఖీ బృందం రూ.5.32 లక్షలు రికవరీని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఈ రికవరీకి గ్రామస్థాయిలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌తోపాటు టెక్నికల్ అసిస్టెంట్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

రికవరీలు వేగవంతం చేస్తున్నాం..



సామాజిక తనిఖీల్లో గుర్తించిన రికవరీలు వేగవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. కొంత మంది సిబ్బంది విధుల్లో లేకపోవడం, మృతి చెందడం వలన రికవరీ చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– నారాయణరావు, ఏపీఓ, సారవకోట

నరసన్నపేట నియోజకవర్గంలో రికవరీ (1 నుంచి 15 విడత వరకు) చేయాల్సిన మొత్తం ఇలా..				
మండలం	సారవకోట	జలుమూరు	పోలాకి	నరసన్నపేట
రికవరీ చేయాల్సిన మొత్తం	రూ.2,33,877	రూ.2,49,135	రూ.2,15,316	రూ.1,030

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు వస్త్రాలు అందజేస్తున్న తోలాపి సత్యసాయి భక్తులు

పొందూరు: మండలంలోని కోటిపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సంస్థ, తోలాపి సత్యసాయి సేవా సమితి సంస్థలు వితరణ చేశారు. బియ్యం, వస్త్రాలు, దుప్పట్లు, వంట పాత్రలు, కిరాణా సామగ్రిని తోలాపి సత్యసాయి సంస్థ సభ్యులు సోమవారం అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ తరఫున రూ. 50 వేలు విలువ చేసే వంట సామగ్రి, రూ.7 వేలు విలువ చేసే కిట్లును అందించారు. రెడ్ క్రాస్ సభ్యులు కాళ్లకూరి శాంతారాం, పి.చైతన్య, సత్యసాయి సభ్యులు సూర రామచంద్రరావు, పప్పల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సామగ్రి అందజేస్తున్న శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సభ్యులు

జాబ్‌మేళాలో 19 మంది ఎంపిక

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మినీజాబ్ మేళాలో 19 మందిని ఎంపిక చేశారు. 44 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరికి నియామకపత్రాలు ఇచ్చామని, శిక్షణ అనంతరం ఉద్యోగాల్లో చేర్చుకుంటామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికిరణ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా నైపణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీజాబ్ మేళా నిర్వహించామన్నారు.

మేలుకొలుపు



ఈ చిత్రం నరసన్నపేట మండలం సత్యవరంలో మేలకొలుపులు నిర్వహిస్తున్న నారాయణవలస బృందం. ధనుర్మాసం ప్రారంభం కావడంతో గ్రామాల్లో మేలుకొలుపులు మొదలయ్యాయి. ప్రతి ఏటా మండలంలోని పరిసర గ్రామాల్లో మేలుకొలుపులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నారాయణవలస బృందం ప్రతినిధి శిమ్మ లక్ష్మణరావు తెలిపారు. గత 20 ఏళ్లుగా మేలుకొలుపు నిర్వహిస్తున్నామన్నారు. మాకివలస, తెలగవలసల్లో కూడా మేలుకొలుపులు ప్రారంభించారు.

– నరసన్నపేట


పుష్పార్చన..



ధనుర్మాసం పురస్కరించుకుని నరసన్నపేట పట్టణంలోని పురుషోత్తం నగర్ కాలనీలో గల సీతారామాలయంలో శ్రీరామ నామ పుష్పార్చన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్థానికులు వేయి నామాలు, వేయి బంతి పువ్వులతో ఉదయం 9 గంటల నుంచి పూజా కార్యక్రమం చేపట్టారు. అర్చకులు వనమాలి బాలకృష్ణ శర్మ, వనమాలి ప్రదీప్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. పతివాడ గిరీశ్వరరావుతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

సరకులకు భద్రత ఏదీ?



సరుబుజ్జిలి మండల కేంద్రానికి సమీపంలో గల పౌర సరఫరాల గోదాంలో ఉన్న సరకులకు భద్రత లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు. సరుబుజ్జిలి మండలంలోని 41 రేషన్ డిపోలు, ఎల్.ఎన్.పేట 36, బూర్జ 33, హిరమండలం, జలుమూరు మండలాలకు 3 చొప్పున, ఆమదాలవలస మండలానికి 1 డిపోకు సరకులు ప్రతినెలా ఈ గోదాం ద్వారా సరఫరా చేయాలి. గోదాం పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. తలుపులు, కిటికీలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వర్షాకాలంలో సరకులు పూర్తిగా తడిసి బూజు పడుతున్నాయని పలువురు డీలర్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి గోదాంను బాగుచేయాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

రోడ్డు పక్కనే చెత్త



ఎల్.ఎన్.పేట మండల కేంద్రం నుంచి లక్ష్మీనర్సుపేట గ్రామానికి వెళ్లే అలికాం–బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారి చెత్త నిలయంగా దర్శనమిస్తోంది. మండల కేంద్రం నుంచి లక్ష్మీనర్సుపేట, పెద్దకోట, బసవరాజుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు పక్కనే చెత్త వేయటంతో కంపు కొడుతోంది. ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కనున్న చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

ప్రణాళికలతోనే సుస్థిరాభివృద్ధి



సరుబుజ్జిలి: ప్రతిజ్ఞచేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నరసన్నపేట: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు సమన్వయంతో వ్యవహరించాలని, సచివాలయ సిబ్బందితో కలిసి సుపరిపాలన అందివ్వాలని ఈఓపీఆర్డీ రేణుక అన్నారు. సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సురక్షిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ విజయకుమార్, ఏపీఎం అప్పలరాజు, ఏపీఓ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ రేణుక

కొత్తూరులో..

కొత్తూరు: గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి కోసం సర్పంచ్‌లతోపాటు మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఈఓపీఆర్డీ వసంతకుమారి, ఏపీఎం లలిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. శిక్షణ తరగతుల్లో ఏపీఎం మాట్లాడారు. పేదరికం నిర్మూలన జరగాలంటే నాణ్యమైన విద్య, వైద్యం అందివ్వాలన్నారు. ఎంపీడీఓ నీరజ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

సరుబుజ్జిలిలో..

సరుబుజ్జిలి: పంచాయతీల పాలనపై ప్రజాప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ ఎం.పావని, ఎంఈఓలు బాలరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ వై.వి.పద్మావతి, ఎంఈఓ బి.ధనుంజయరావు, మండల పరిషత్ కార్యాలయ, వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: గ్రామ పరిపాలనలో కీలకమైన పంచాయతీరాజ్ చట్టాలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. పంచాయతీలకు ఆదాయం వచ్చే మార్గాలను తెలుసుకుని గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

పాతపట్నంలో..

పాతపట్నం: పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ పి.చంద్రకుమారి సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే ఆదాయ వనరులపై దృష్టి సారించాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఉదయ్‌భాస్కర్, ఏఓ తిరుపతి పట్నాయక్, ఈఓపీఆర్డీ వెంకటరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

సారవకోటలో..

సారవకోట: సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీలలో 9 అంశాలపై అభివృద్ధి సాధించేందుకు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్డీ ప్రభాకర్, ఎంఈఓ ఎం.వి.రమణ, ఏఓ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జలుమూరులో..

జలుమూరు: పంచాయతీల అభివృద్ధిలో అధికారులతోపాటు సర్పంచ్‌లు కీలకమని ఎంపీడీఓ కె.అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌ల శిక్షణలో మాట్లాడారు. నిధుల వినియోగం, విధులపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పురుషోత్తపురంలోని రంగనాథస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు సనపల యతిరాజుదాసు ఆధ్వర్యంలో నెల గంట కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం స్వామివారికి సహస్ర నామార్చనలు, తిరుప్పావై ప్రవచనాలు, పాసురాలు చేపట్టారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

క్షేత్రపాలకునికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న స్వామివారు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని క్షేత్రపాలకుడు విష్ణుమూర్తికి ధనుర్మాసం మొదటిరోజు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసీదళార్చనలు, ఏకవార అభిషేకాలు చేశారు. నెల రోజులు విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

పైడితల్లికి రాష్ట్ర సంఘంలో చోటు



పైడితల్లి

ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అకడమిక్ సెక్రటరీగా ఆమదాలవలస మండలం తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ డి.పైడితల్లి ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని జీసీటీఏ జిల్లా సెక్రటరీ డాక్టర్ ఎస్.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైడితల్లి యూనివర్సిటీ సెక్రటరీగా, జోనల్ ప్రెసిడెంట్‌గా పని చేశారన్నారు. రాష్ట్రస్థాయి కార్యవర్గంలో జిల్లా నుంచి అకడమిక్ సెక్రటరీగా ఎన్నికవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యనారాయణరావు అభినందనలు తెలియజేశారన్నారు. పైడితల్లి ఎన్నిక పట్ల జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.చక్రపతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామారావు, కళాశాల అధ్యాపకులు, జిల్లా స్థాయి, కళాశాల స్థాయి వివిధ కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు హర్షం వక్తం చేశారు.

రూ.4.80 లక్షలతో రహదారి అభివృద్ధి



మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం–తెంబూరు రోడ్డులో సీతారాంపల్లి నుంచి తెంబూరు గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును రూ.4.80 లక్షలతో మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్అండ్‌బీ జేఈ యోగి సోమవారం తెలిపారు. రోడ్డంతా గోతులమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగేది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రజలు, వాహనచోదకులు అవస్థలు పడేవారు. పాతపట్నం నుంచి టెక్కలి వెళ్లాలంటే రెండు గంటలు సమయం పట్టేది.

● ఇష్టానుసారంగా తవ్వేశారు..!



మాకివలసలో ఇటీవల నిర్మించిన రోడ్డును తవ్విన దృశ్యం

సారవకోట: మండలంలో పలు గ్రామాలలో జల్ జీవన్ మిషన్ ద్వారా పైపులైన్లు వేసేందుకు కొత్తగా నిర్మించిన రోడ్లును సైతం గుల్ల చేస్తున్నారు. మండలంలోని మాకివలస గ్రామంలో రెండేళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. మాకివలస నుంచి జలుమూరు మండలంలోని శ్రీమనారాయణపురం వెళ్లే రహదారిలో వేసిన సిమెంట్ రోడ్డును ఇటీవల ఇష్టానుసారంగా తవ్వి వైపులైన్లు వేశారు. వైపులైన్లు వేసిన తరువాత అలాగే ఉంచేస్తున్నారు తప్ప.. మరమ్మతులు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పరామర్శ..



రమణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

సారవకోట: మండలంలోని శివరాంపురం గ్రామానికి చెందిన పల్లా రమణమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ నాయకులు కోరాడ అప్పయ్య, యాళ్ల శ్యామసుందరరావు, రావాడ శ్రీనివాసరావు, రావాడ భాస్కరరావు తదితరులు ఉన్నారు.